# కుక్కుటేశ్వరము

బక్కచిక్కిన ముసలమ్మ అస్థిపంజరం కట్టెపురుగులాగ ఊగిసలాడ్డం మొదలుపెట్టింది. పత్తిభోగల్లాటి కళ్ళెత్తి చూసింది. ఆ కళ్ళకి చత్వారం లేదు. మధ్యకాలంలో వచ్చిన చత్వారం మధ్యకాలంలోనే పోయింది. ముసలమ్మ చూసీ చూడ్డమే పోల్చింది ఒక నిట్టూర్పు విడిచి ఈశ్వరుణ్ణి తలచుకుని మనస్సు కట్టుదిట్టం చేసుకొంది.

"ఎవరివి నాయనా నువ్వు?" అని, తనే కాస్త బంధుత్వం కలుపుతూ ప్రశ్నించింది.

"మనం మనం పాతవాళ్ళమే. మళ్లా వచ్చా ముసలమ్మా!" అన్నాడు ఎదురుగుండా ఉన్న ఉద్యోగస్తుడు. ఏమిటి సాధనం శ్రీమన్నారాయణ మూర్తీ అని దేవుణ్ణి సంబోధించుకుంది. కుక్కుటేశ్వరుడి ఆజ్ఞ లేనిదే కుక్కయినా మొరగదు అని ధైర్యం చెప్పుకుంది.

"లే" అని గద్దించాడు ఉద్యోగస్తుడు. ముసలమ్మ లేస్తే నేరమే. లేవకుండానే వాణ్ణి సాధించాలి. లేవడానికి కాళ్ళలో సత్తువ వాస్తవంగానే తప్పిపోయింది. ముసలమ్మ ముసుగు సవరించుకొంది. పైట చెరుగు తీసి ఒళ్ళంతా కప్పుకుంది.

"నన్నెందుకు నాయనా లేవమంటున్నావు? టిక్కట్టు కొనుక్కున్నాను" అని అమాయకురాలిలాగా మొహం పెట్టింది. మొల్లో చెంగు కొస తీసి వెయ్యిముళ్ళలో ఓ ముడిని విప్పుతున్నాది.

"పీటముడి ఊడిరాకుండా ఉంది" అన్నది.

"రైలు ఆగనీ చూద్దాం తాపీగా" అని ఉద్యోగి ఎదురు బెంచీమీద బైఠాయించాడు. జేబులోంచి కేప్స్టను సిగరెట్టు పెట్టె పైకితీశాడు. తాపీగా సిగరెట్టుతీసి ముట్టించాడు. అధికార అహంకారంతో రైల్లో ప్రయాణీకులందరివైపు ఒకసారి చూశాడు.

ముసలమ్మ కొంగుముడి మరి విప్పలేదు. ఇహ నెందుకు! రైలు టిక్కట్టు! ఆ అంగుళన్నర అట్టముక్క చేతిలో ఉంటే ఎక్కడికైనా పోవొచ్చు! అదంటూ ఉంటే తెల్లారేసరికి శ్రీజగన్నాథం పోయి స్వామి వారిని ధూళిదర్శనం చేసుకోవచ్చు.

రాత్రి పదకొండు కాకుండానే బరంపురంలో దిగి కూతుర్నీ, పిల్లల్నీ, అల్లుణ్ణీ చూసుకోవచ్చు! దానికి గతిలేకే ముసలమ్మ ఎనిమిదేళ్లయి కూతుర్నీ పిల్లల్నీ చూడలేకపోతున్నాది.

కూతురి పిల్లలు, తానెరిగిన ముగ్గురూ కళ్ళకి కడుతున్నారు. ఎనిమిదేళ్ళ క్రితం కూతురికి మూడో పురుడు పొయ్యడానికి ముసలమ్మ బరంపురం వెళ్ళింది. మూడోపురుడు పుట్టింట పనికిరాదని కొడుకు చెల్లెల్ని తీసుకొచ్చాడు కాడు. తరువాత కొడుకుని అనీ ప్రయోజనంలేని రోజులు వచ్చాయి. ఎనిమిదేళ్ళయి కాలం వక్కలాగ మండిపోతున్నాది. అందులోకి నాలుగేళ్ళయి మరీ అద్దానమైపోయింది.

తాను పురుడుపోసిన చంటిగుడ్డుకి ఇప్పుడు ఎనిమిదేళ్ళు! ఆ తరువాత కూతురు మరి ఐదుగురు పిల్లల్ని కనుక్కొంది. బరంపురానికి రానూ పోనూ టిక్కట్టుకి కాస్తా కూస్తా అవుతుందా? టిక్కట్టు లేకుండా దగ్గర ప్రయాణాలే ప్రమాదకరం. ఇంక బరంపురం ఎక్కడ వెళ్ళగలదు! ముసలమ్మ చెవుల్లో కేరుకేరుమని చంటిగుడ్డు ఏడుపు వినబడుతున్నాది.

గోదావరి మండలం అంతర్ధానమైపోతున్నాది! పొలాలు సస్యశ్యామలంగా ఉన్నాయి. ఈన సిద్ధంగా ఉన్న వరిచేలు పరుగులు పెడుతున్నవి. పొలాలనిండా నీటితో నింపి ఏలేరుతల్లి పరిపాలిస్తున్నాది. తరతరాలబట్టి పితృదేవతలంతా ముసలమ్మకి అన్ని వంకలవారూ దరిద్రాన్ని పంచిపెట్టుకొచ్చారుకాని కాస్తంత మట్టిబెడ్డ సంపాదించి పెట్టలేదు.

రైలు వాయువేగ మనోవేగములతో పరుగెడుతున్నాది. పడమట మూలనుంచి కొండలు హారాలు హారాలుగా పరిగెట్టుకు వస్తున్నాయి. మేఘాలు మందలు మందలుగా వచ్చి చిక్కబడుతున్నాయి.

ఎదురుగా ఖరోడాలాగా ఉద్యోగి కూచున్నాడు. ఎదురుగా ఉన్న ఉద్యోగి అక్కడ ఉన్నాడా భ్రాంతా? చల్లటిగాలి ప్రాణానికి హాయిగా వీస్తున్నాది.

"నువ్వెవరబ్బాయివి నాయనా?" అని ముసలమ్మ ఉద్యోగిని అడిగింది. వాడు అతి దగ్గర బంధువు అయిపోకూడదూ?

"మా అమ్మ కొడుకునే!" అని వెటకారంగా నవ్వేడు.

"మీరంతా అమ్మ కొడులే కాని...." అని లోలోపల గొణుక్కుంటూ పళ్ళు కొరుక్కుంది. ముసలమ్మకి ఒక్క పన్ను ఊడలేదు.

"పళ్ళు కొరుకుతున్నావేం?" అని హుంకరించాడు.

"వొణుకు సంకటం, పళ్ళు కొట్టుకొంటాయి. మరేం విషప్పళ్ళు కావులే "అన్నాది.

ఎదురుగా ఉన్నది రజ్జువుకాదు సర్పమే. పగబట్టిన నాగుపాము. ముసలమ్మని జ్ఞాపకం పెట్టుకునే ఉన్నాడు ఉద్యోగి. వాడికి గతనెల్లో పట్టుబడ్డాది. అప్పుడు సగం అన్యాయం, సగం న్యాయంచేశాడు. డబ్బు మాత్రం పన్నెండు రూపాయలు గోదావరిపాలు అయింది.

పన్నెండు రూపాయలంటే మాటలా? ఆ పన్నెండు రూపాయలూ ముప్ఫైయారు రూపాయలకింద లెక్క. ఏడేళ్ళయి వాళ్ళింట్లో రాత్రిపూళ్ళ భోజనాలులేవు. నిత్యం శనివారమే. పిల్లలకీ పెద్దలకీ కూడా శనివారమే. ఈ నష్టంనుంచి మూడేసిరోజులకొక ఏకాదశికూడా ఆ నెలలో చేశారు. ఆ పుణ్యమంతా ఈ ఉద్యోగే మూటకట్టుకున్నాడు. గతనెల కొంపలో అంతా మంగలంలో పేలాల్లాగ పేలిపోయారు. ఇవాళ మళ్లా భీష్మించుకు వచ్చాడు. ఈమాటు అందర్నీ మహమ్మాయి జేస్తాడు.

ఉద్యోగి సిగరెట్టుమీద సిగరెట్టుతీసి ఒకదాని కొకటి అంటించుకొని ఊదేస్తున్నాడు. రొజ్జగాలికి సిగరెట్టు అంటించీ అంటించడంలో సగానికి రాజుకు పోతున్నాది.

"కోపం తెచ్చుకోక ఒక్కమాట చెపుతాను వింటావా?" అన్నాది.

"మా కెంచుకండి కోపం. మా డ్యూటీ మేము చేస్తాము" అని సౌమ్యంగా జవాబు చెప్పాడు.

"నన్ను పట్టుకొంటే నీకేం కలిసొస్తుంది?"

"ప్రభుత్వానికి కలిసివస్తుంది. అందుకే మాకు జీతం ఇస్తూన్నది."

"కుడీ ఎడమా లేదా?"

"ఉన్నాయి, మీరు చేస్తున్న పని తప్పుకాదా?"

"మా వంటివాళ్ళు చేసినా తప్పే?"

"తప్పే. ఇక్కడ ప్రభుత్వం ఉంది. నేరస్తులు శిక్షించబడతారు" అన్నాడు. ఇక్కడ ప్రభుత్వం ఉంది. ప్రభుత్వ శాసనం ప్రకారం ఇక్కడి బండి చక్రాలు నడవాలి! ముసలమ్మ ప్రభుత్వాన్ని కూల్చద్రోసి ధిక్కరిస్తున్నాది!

"ఎందుకమ్మా గొడవ. ఆయనకేదో పారెయ్యరాదు. పోతాడు" అని ఒక ప్రయాణీకుడు ఆఖరికి వినివిని కలుగజేసుకొన్నాడు. ముసలమ్మ వళ్ళు మరచిపోయింది.

"నా దగ్గర రొక్కం చిల్లిగవ్వలేదు. ఉన్నదంతా వాళ్ల ఎదానకొట్టి వచ్చాను. గడ్డితినే పశువులంతా అధికారులైనాక వాళ్ళ నోట్లో ఇంత గడ్డి కుక్కితే ఊరుకుంటారని ఎంత ముసలమ్మనయినా ఎరుగుదును. నా దగ్గర ఉండిచావందే" అన్నాది ముసలమ్మ.

"నోటికొచ్చినట్లు మాట్లాడకండి. నేనెవర్నో తెలుసా?" అన్నాడు ఉద్యోగి. వ్యవహారం శృతిమించుతున్నాది.

"ఊరుకోవమ్మా, నువ్వు గడ్డితింటూ అందరికి గడ్డి పెడతానంటావు!" అన్నాడు, ఇంకో ప్రయాణీకుడు.

"ఔను నేనే గడ్డి తింటున్నాను, మీరంతా ప్రభువులు అయినాక ప్రజలు గడ్డి తినక అన్నం ఎక్కడ తింటారు? గడ్డికూడా కాదు నాయనా! మన్నే తింటున్నాము. కడుపునిండా తినాలంటే మన్నొక్కటే ఉంది" అన్నాది ముసలమ్మ.

"మన్నుమాత్రం మనదిటమ్మ? అదీ తేరగా లేదు. మట్టిపెళ్లా మనదికాదు. కామందులు ఊరుకుంటారా? మట్టి తీసినా దొంగతనమే" అన్నాడొక ప్రయాణీకుడు.

"నీ కడుపు చల్లగా నిజం చెప్పేవు నాయనా!" అన్నది ముసలమ్మ.

"ముసలమ్మా! ఆయనకో రూపాయి పారెయ్యి" అన్నాడు మొదటి ప్రయాణీకుడు.

"అవకతవక మాటలాడవద్దు" అన్నాడు ఉద్యోగి.

"ఎందుకయ్యా! అంత పట్టుదల. మూలనున్న ముసలమ్మని పట్టుకున్నావు ఎలాగైతేనేమి !" అన్నాడు ప్రయాణీకుడు.

"మీమీదా కేసు పెట్టమన్నారా?"

"ఎందుకయ్యో !"

"ఎందుకా నా డ్యూటీ చేసుకోకుండా అడ్డం వచ్చినందుకు. తెలిసిందా?" అని మరో సిగరెట్టు తీసి సిగరెట్టుకే అంటించుకొంటున్నాడు.

"నీ లాంటివాళ్ళని నా తలమీద ఎన్ని వెంట్రుకలున్నాయో అంత మందిని చూశాను. శ్రీరంగనీతులు చెప్పకు. చూస్తూ ఉంటే కేప్స్టను సిగరెట్లు అలాగ ఊదేస్తున్నావు! నువ్వు నీ జీతంమీదే బతుకుతున్నావా?" అని ఎర్రగా చూశాడు ప్రయాణీకుడు. ఉద్యోగికి మొహంమీద కొట్టినట్లు జుమాయించింది.

"సరే సరే చెపతాను" అని లేచి తలుపు దగ్గిరికిపోయి తల అవతలకి పెట్టేసుకున్నాడు. మేఘాలు గుంపులుగా గుమిగూడుతున్నాయి. కొండలు పరిగెట్టుకుంటూ దగ్గరకొస్తున్నాయి. సుఖమైన గాలి వీస్తున్నాది. ఉద్యోగి వొళ్ళు చల్లబడుతున్నా బుర్రలో రైళ్ళు పరిగెడుతున్నాయి. ఎంత మాట అన్నాడు ప్రయాణీకుడు! ఇప్పుడంతా మొహమ్మీద అనేస్తున్నారు. ప్రజలు బొత్తిగా బరిదిగి పోతున్నారు. అధికారంలో ఉన్న ఎవడు మానేశారు? మడికట్టుకు కూచుంటే మడిమాన్యాలు సంపాదించగలరా? చేతనైనవాడు చేతినిండా పుచ్చుకోవల్సిందే.

ప్రయాణీకుడితో జట్టీ పెంచుకోవడం ఉచితంగా వాడికి తోచలేదు. చాపకింద నీరు లాగా తన పని తాను చేసుకోవాలి! రచ్చపడకూడదు. సిగరెట్టు మళ్ళా కొసకొచ్చేసింది. మరో సిగరెట్టు తీసి ముట్టించడానికి ధైర్యం చాలిందికాదు. ప్రయాణీకుడి మాట వాణ్ణి పిరికిపందని చేసేసింది; అతనెవడో! అంత ధైర్యంగా చీవాట్లు పెట్టాడు! అటువంటివాళ్ళతో జట్టీ ప్రమాదకరమౌతుంది. ఇంకో సిగరెట్టుకోసం నరాలు పీక్కుతింటున్నాయి. తీసి మళ్ళా ముట్టించాడు. కాని సిగరెట్టు ప్రయాణీకులకి కనబడకుండా చేతిలో మూసుకు పట్టుకున్నాడు.

కొండలు కొండలమీద మేఘాలు మనోజ్ఞంగా ఉన్నాయి. చుట్టూ పత్తి, మిరపపొలాలు తివాసుల్లాగ పరుచుకుని ఉన్నాయి. కొండలనిండా రంగులు తేలుతున్నాయి. ఆకాశమంతా ఊదారంగు వ్యాపించింది. ఉద్యోగి మనస్సులో భీతాహం పోయింది.

ఎదురుగుండా కొండలన్నీ వాడెరుగును. పిట్టలమాటు, పులిమాటు తను వెళ్ళి చూసినవే. చేస్తున్నది చిన్న ఉద్యోగమైనా అనుభవిస్తున్నది దేవేంద్రభోగమే. ఐశ్వర్యం వొచ్చి మీదపడి పోతున్నాది. ఒహడు తిడతాడని, ప్రపంచం హర్షించదని పెట్టుకున్నంత అవివేకం లేదు. వెయ్యితావులయి ఒక బూరెమొక్కకి సాటికాదని పూర్వుల మతం. ఎవరెన్ని శాపాలు పెట్టుకొన్నా తలుపులమ్మలోయకి షైరువంటిది అవుతుందా?

ఉద్యోగి పదిమంది మిత్రులతో కలిసి తలుపులమ్మలోయకి షైరు వెళ్ళేరు. అక్కడి ప్రకృతి రమణీయత వర్ణనాతీతం. ఎంత మండువేసవి అయినా శీతలంగా ఉంటుంది. రాతిలోంచి సదా జల వస్తూ ఉంటుంది. సన్నని జలధార అమృత సమానమైన జలము, అక్కడ హాయిగా బంగళాలు కట్టుకుని ఈ ధనికులంతా తమ తమ వేశ్యలతో కొంతకాలముండి ఎందుకు సుఖపడరు అని ఉద్యోగికి ఆశ్చర్యం కలుగుతూ ఉంటుంది.

తలుపులమ్మలోయకి వెళ్ళిన మిత్రులంతా అనుభవించడానికే వెళ్ళారు. వాళ్ళు ఒంటరిగా వెళ్ళలేదు. పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ గ్రామాలనుంచి ఏరుకొని వెలయాళ్ళని వెంటబెట్టుకు వెళ్ళారు. మిఠాయి పొట్లాలు, పళ్ళతట్టలు, పుల్లావు సామాను మోసుకుపోయారు. వాళ్ళకి వొక్కటే లోపం వచ్చింది. బర్గండివైన్ ప్రయత్నిస్తే దొరికిందికాదు. బ్రాందీమాత్రం కావలిసినంత లభ్యమైంది.

ఉద్యోగం అంటూ ఉండబట్టి, అందులో వీలు ఉండబట్టి తలుపులమ్మలోయలో, మరుపుకిరానిరోజు సాధ్యమైంది. ఎంతమందో స్వప్నంలో కోరుకొనేది వాడికి జీవితంలోనే ఇంద్రధనుస్సులాగ ప్రకాశిస్తున్నది.

నీలమేఘాల మధ్యని తెల్లగా రాజహంసలాగ మెరుస్తూ కనబడ్డాది అన్నవరం సత్యనారాయణమూర్తి ఆలయం. ఉద్యోగి నోట్లో సిగరెట్టుతీసి పారేశాడు! రెండు చేతులూ తీసి కొండమీద దేవుడికి నమస్కారం చేశాడు. ఈ ఉద్యోగంవచ్చి, ఈ నాటికి వచ్చినది లగాయతు ఏటా కొండ ఎక్కి సత్యనారాయణ వ్రతం చేసుకొంటున్నాడు. లక్షలకి లక్షలు, వేలకి వేలు డబ్బు పోగుచేసుకొన్న వాళ్ళంతా ఈ మధ్య కొండ ఎక్కి తరచు వ్రతాలు చేస్తున్నారు. సత్యనారాయణమూర్తి వాళ్ళందరికీ బాగా బాఖలా ఇస్తున్నాడు.

"తలుపుకి అడ్డంలే నాయనా దేముణ్ణి చూసుకొంటాను" అన్నాది ముసలమ్మ. ఉద్యోగి కిక్కురుమనకుండా అడ్డం లేచిపోయాడు. బెంచీమీద కూచొని దేవాలయాన్ని చూస్తూ మనస్సంతా భగవదర్పితం చేసుకొంటున్నాడు.

అన్నవరం రైలు స్టేషనులోంచి రైలు పోతున్నాది. ముసలమ్మ కొంగలాగ మెడ సాగదీసుకొని ఎగిరి ఎగిరి చూసింది. అన్నవరం స్టేషను కెదురుగా తుమ్మ అడవి ఉంది. ముసలమ్మకి కంటకాలతో సహా గుబురు కొన్న తుమ్మడొంకలు కనబడ్డాయి.

"నువ్వు కనబడవు. కంటకాలే కనబడతాయి. మా పక్క చూడవు. కొండెక్కి కూచున్నావు" అని ముసలమ్మ సత్యనారాయణతో చెప్పింది.

రైలుకి విరాళమెత్తింది. కొండల మధ్య మార్గం. చక్రాల మోతకి చెవులు చిల్లులు పడుతున్నాయి.

"భగవంతుడికి దయ లేదు; నరుడికీ దయ లేదు" అన్నాది ముసలమ్మ.

"ఆ సత్యనారాయణమూర్తి సన్నిధానంలో చెపుతున్నాను. చిన్నవాడివయినా నీ కాళ్ళు పట్టుకొంటాను. పాపం ఒడికట్టుకోకు. నా కొడుకు స్కూలు మేష్టరు. ఏభైరూపాయిలిస్తారు. వాడి కారుగురు పిల్లలు. వాడిపీక మీదికి నేనొహత్తెనున్నాను. నన్ను పట్టుకొన్నావా ఈ నష్టం వాడికి తగులుతుంది. ఇంతమంది ఉసురూ పోసుకోకు" అని ముసలమ్మ చెప్పింది. ఉద్యోగికి తేళ్ళు జెర్రులూపాకినట్టుంది. ముసలమ్మ సత్యనారాయణమూర్తి పేరు ఉచ్చరించకండా ఉంటే బాగుండేది. కరుకుగా ఉండడమే వాడి స్వభావము. స్వభావానికి విరుద్ధంగా ముసలమ్మ వ్యవహారం పరిణమించింది.

"ఇంకా ఎందుకయ్యా ముసలమ్మ మీద పట్టిస్తావు. తుని కూడా దగ్గర పడ్డాది. ఏదో తుని తగువు చేసేయి" అన్నాడు ప్రయాణీకుడు.

"నేను వొదిలితే మిగతావాళ్ళు వొదులుతారా?" అన్నాడు.

"ఆ పాటి చెప్పలేవా?" అన్నాడు ప్రయాణీకుడు. రైలు రెండు నిమిషాలు కూత పెట్టింది. దాని పరుగులో మార్పు వచ్చింది. తిరగబడే

ట్టు అటూ ఇటూ వూగుతూ పట్టాలు మారుతున్నాది. క్రమేణా వేగం తగ్గుతూ తుని ప్లాటుఫారము మీద ఆగింది.

ఎక్కే జనం దిగే జనం తొడకొక్కిడి అయింది. బండిలోకి తోచుకుని మరో నలుగురు యమదూతలు ఎక్కేరు.

"ముసలమ్మా! మళ్ళావచ్చా!" అని పలుకరించారు. దానికింద దవడ వేళ్ళాడిపోయింది. నలుగురూ చుట్టబెట్టేశారు. ఉద్యోగి ముసలమ్మని వొదిలిపెట్టమని వాళ్ళతో చెప్పలేదు! తానేదోలంచంతీసికొని ఉంటాడనివాళ్ల భావిస్తారు. వొంతు అడుగుతారు! ముసలమ్మని అప్పచెపి వెళ్ళిపోయాడు.

"ఏయ్ ముసలమ్మా! ఒక్కసారి లేచి నిలుచో" అన్నారు చుట్ట వేసిన ఉద్యోగులు. ఇహ లాభంలేదు. కళ్ళు చీకట్లుకమ్మి చుట్టూ అయోమయం అయిపోయింది. కొత్తగా ఎక్కిన ప్రయాణీకులంతా ముసలమ్మ చుట్టూ దడి గట్టి నిలుచున్నారు.

"ముసలమ్మా! ఈ పని బాగుందా?" అని అడిగారు. ముసలమ్మ నోరు లేవలేదు.

"ఇది రెండవసారి కదూ!" అన్నారు.

"ఆరుగురు పిల్లలు కడిగేసిన ఏభై రాళ్ళు - తొమ్మండుగురం బత కాలి" అంటూ దవడలు ఆడించింది.

"మరో ఆరుగుర్ని కనుక్కోండి" అని వొకడు మహా వెటకారంగా నవ్వేడు.

"ఒకసారి క్షమించారు. ఇహ క్షమించకండి. బతకడం నేరంగా ఉంది" అన్నాది ముసలమ్మ.

"తప్పు పని చేస్తే నేరమంటారు" అన్నాడు ఉద్యోగి.

"ధర్మదేవతకి ఉన్న కాళ్ళు విరగ్గొటేశారు. ధర్మపన్నాలు నెరుపుతున్నారు" అన్నాది ముసలమ్మ.

"ధర్మపన్నాలు వల్లెవేయక లే" అన్నాడు ఒక ఉద్యోగి. ముసలమ్మ లేవలేదు.

"లేస్తావా లేవగొట్టమన్నావా?" అని అశనిపాతంలాగా అరిచాడు ఒకడు. ఇహ ముసలమ్మ కూర్చోలేకపోయింది. అడుగునుంచి ఏదో శక్తి

పైకి లేవదీసింది. లేచి నిలబడ్డాది. ముసలమ్మ నేరాన్ని కింద వేసుకొని సుఖంగా కూర్చుంది.

"నాది కాదను" అని ఒకరు పక్కనుంచి సలహా ఇచ్చారు.

"వొదలిపెట్టే" అని మరొకరు సలహా ఇచ్చారు.

"వదిలేసి ఏ యేట్లో పడను?" అని ముసలమ్మ వాళ్ళని ప్రశ్నించింది.

"దాంట్లో చిక్కు నీకు తెలియటంలేదు" అని ఇంకొకరు చెప్పారు.

"నేను దొంగతనం చెయ్యలేదు. నా కొడుకు చెమటోడ్చి గడించుకొన్న డబ్బుతో కొనుక్కున్నాను" అని ముసలమ్మ ఏడుపు మొహం పెట్టింది.

"ఈ సాకులు మాకు తెలుసు నడవ్వమ్మా" అన్నాడు ఉద్యోగి.

ముసలమ్మ కడవలతో కన్నీళ్ళు కారుస్తూ నిలబడ్డాది.

"నంగనాచిలాగ ఏడవక లే" అన్నాడు ఉద్యోగి.

"కడుపునిండా పెట్టరు. ఉన్నచోటి కెళ్ళి కొనుక్కోనివ్వరు. ఈ నాటికి బియ్యం కొనుక్కోవటం నేరమైందా?" అని ముసలమ్మ రెండు కాళ్ళ మధ్యనున్న ఐదుకుంచాల బియ్యపు మూటని మోకాళ్ల మీదికి ఎత్తుకుంది.

"శ్రీరామచంద్రుడిలా వారు పాలిస్తున్నారు తల్లీ! ఇంట్లో బియ్యముంటే నేరం! కొనుక్కుంటే నేరం. అమ్మితే నేరం. సరిపడేలాగ తింటే నేరం!" అన్నది పక్కనున్న గవరల వర్తకురాలు.

"ఎందుకమ్మా! డబ్బిచ్చి వ్యాజ్యం కొనుక్కుంటావు?" అన్నాడు పక్కనున్న హితైషి.

"వొదిలీ వొదిలీ అని ముష్టిసలహా ఇవ్వకపోతే వాళ్ళ నోట్లో గడ్డి పెట్టకూడదూ? వొదిలేసి పిల్లలని పస్తుపెట్టనా? మీరంతా మనుషులే?" అని భీకరంగా ముసలమ్మ అందర్నీ అడిగింది.

"ఓహో అలాగా! రోజూ పట్టికెళ్ళి బ్లాకు మార్కెట్టులో అమ్ముకోవడం అనుకొన్నావా? పద పదా" అన్నాడు ఉద్యోగి.

"పదండి భడవల్లారా! నేనే దొంగమార్కెట్టులో అమ్ముకొని మేడలు కడుతున్నాను. నాకు ఉరిశిక్షకు తక్కువ వెయ్యకండి. నా పొగ కుక్కుటేశ్వరుడికి ధూపం వెయ్యండి" అంటూ ముసలమ్మ బియ్యపు మూటని భుజానికెత్తుకుని వాళ్ళవెంట నడిచింది.

గోదావరి మండలం సరిహద్దులు దాటించి, ప్రభుత్వపు శాసనాన్ని ధిక్కరించి హద్దుతప్పి, ఐదేసి కుంచాలు చొప్పున బియ్యం తరచు తరలించుకు పోతున్న ఒక ముద్దాయి పట్టుబడ్డది!